మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలి

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వం మహిళలకు 33శాతం రిజర్వేనేషన్ బిల్లు పాస్ చేసిన అమలు చేయకపోవడం దురదృష్టకరమని వెంటనే అమలు చేయాలని టీపీసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వంలో మహిళ్లపై అణచివేత ఇంకెంత కాలమని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తక్షణమే అన్ని రంగాల్లో అమలు చేయాలని ప్రధాని మోదీని కోరారు. మహిళలకు పెద్దపీట వేసిందని కేవలం కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. అందుకే బీజేపీ కార్యాలయం ముట్టడి, ప్రధాని మోదీ దిష్టి బొమ్మ దహనం చేశామని అన్నారు.

మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

ముషీరాబాద్: మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణకు సాధ్యమయ్యిందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గండి కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం లభించినందుకు ఇందిరానగర్‌లో ఎమ్మార్పీఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు దశరథ్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన గండి కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసిన మందకృష్ణమాదిగను ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జల రాజశేఖర్‌మాదిగ, నాయకులు ఎల్లయ్య, నందగిరి నర్సింహ, సత్యనారాయణ, వెంకటయ్య, నందు, జీవన్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పనిచేయాలి

కాచిగూడ: సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు. కాచిగూడలోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పలువురు యువత బజరంగ్ సేనలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన యువతకు ఆయన సంప్రదాయ కండువాలు వేసి బజరంగ్ సేనలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బజరంగ్ సేన అభివృద్ధికి కృషి చేస్తూనే సమాజ సేవా కార్యక్రమాలల్లో చురుకుగా పాల్గొనాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ వికాస్‌సింగ్, గోవింద, చందు, నందు పాటిల్, మహాదేవ్, సచిన్, అనిల్, కృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇఫ్తార్ విందులు ఐక్యతకు దోహదపడుతాయి'

అంబర్‌పేట: ఇఫ్తార్ విందులు ప్రజల ఐక్యతకు దోహదపడుతాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఏఎం–పీఎం పాన్‌షాపు లేన్‌లో జరిగిన ఇఫ్తార్ విందుకు స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రతి కార్మికుడు మతసామరస్యాన్ని కాపాడి దేశ ఆర్థిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మాజీ ఎంపీ, వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో అబ్దుల్ సమద్, అబీబ్ షరీఫ్, ఇస్మాయిల్‌ల ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... కార్మికులంతా ఐక్యమత్యంతో సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌టీ డీజీఎం శివకుమార్, యూనియన్ నాయకులు జె.రాజు, ఎండీపాల్, ఎఆర్ శ్రీనివాస్ యాదవ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బుద్వేల్–ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి (60) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

కాచిగూడ: ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌బాగ్ ప్రాంతానికి చెందిన వెంకటేష్ కుమార్తె నిఖిత (20) ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో, బంధు, మిత్రుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి వెంకటేష్ కాచిగూడ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏవీ కళాశాల వద్ద భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న వీఎస్ఆర్



దోమలగూడలో నివాళులర్పిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



నివాళులర్పిస్తున్న హిందూ వాహిని నగర నాయకుడు బబ్లూ విశ్వేశ్వర్



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు

భారతజాతి ఎప్పటికీ మర్చిపోదు..

కవాడిగూడ: భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలను దేశ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యుడు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుక్‌దేవ్‌ల 94వ వర్ధంతిని ఏవీ కళాశాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి యువత కాంగ్రెస్ మోసపూరిత హామీలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కల్వగోపి, రమేష్, సిరిగిరి శ్యామ్, సత్తి, అరుణ్, వెంకటేష్, చెన్నయ్య, నరి, యాదగిరి, సోమేష్, బాలయ్య, మధు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ నేటి తరానికి స్ఫూర్తి: ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డిసుధాకర్

బ్రిటీష్ నిరంకుశ పాలన నుంచి భారతదేశ విముక్తి కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నేటి తరానికి స్ఫూర్తి అని ఆప్ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. భగత్‌సింగ్ నవజవాన్ భారత్ సభను స్థాపించి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాడడానికి యువత, కార్మికులు, రైతులను ఏకం చేశారన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురువు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకొని దోమలగూడలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి యువత నిరంకుశపాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. మార్చి 23 భగత్‌సింగ్ వర్ధంతి నుంచి ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి వరకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు విజయ్ మల్లంగి, జావేద్ షరీఫ్, రాకేష్, సుధారాణి, అజీమ్‌బేగ్, మహ్మద్ సోహేల్, అస్సన్ అహ్మద్, సత్యనారాయణ, కొండల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భగత్‌సింగ్ వేషధారణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా చిన్నారులు వేసిన భగత్‌సింగ్ వేషధారణ సభికులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులంతా ప్లకార్డులు ప్రదర్శిస్తూ 'భగత్‌సింగ్ ఆదర్శాలను కొనసాగిస్తాం, భవితకు బాటలు వేస్తాం'అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఎండీ అబ్బాస్, గుమ్మడి నరేష్, రాజయ్య, వరప్రసాద్‌రెడ్డి, రుక్మిణి, వసుంధర పాల్గొన్నారు.

ప్రాణాలనర్పించిన పోరాట యోధుడు..

ముషీరాబాద్: దేశాన్ని బ్రిటీష్ పాలకుల కబంధహస్తాల నుంచి విడిపించేందుకు భగత్‌సింగ్ తన ప్రాణాలను అర్పించిన పోరాట యోధుడని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, బింగి నవీన్, ముచ్చకుర్తి ప్రభాకర్, మగ్బుల్, నవీన్‌కుమార్, గోవింద్, శంకర్‌ముదిరాజ్, మహ్మద్ అహ్మద్, బబ్లూ, భీమ్, సాయికుమార్, మహేష్ తదితరులున్నారు.



ఎస్వీకేంద్రంలో జరిగిన వర్ధంతి సభలో భగత్‌సింగ్ వేషధారణలో చిన్నారులు

గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు...

దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబం ఎక్కిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ అని హిందూ వాహిని నగర నాయకుడు బబ్లూ విశ్వేశ్వర్ అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకోని భోలక్‌పూర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివ, సూర్యం, మురళీ, మణికంఠ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు ఐక్యతను చాటాలి

తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపులు మహాసభ జీవితకాల సభ్యత్వాన్ని తీసుకుని ఐక్యతను చాటాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. మహాసభ సర్వసభ్య సమావేశం పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం బీఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాచిగూడలోని మహాసభ సభ్యత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్నూరుకాపులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అందుకు మహాసభ నిరంతరం కృషి చేస్తుందన్నారు. మున్నూరుకాపుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆకుల నగేష్, చేపూరి వెంకటేశ్వర్‌రావు, గండు సతీష్, ఎనుగుల హరీష్, చామకూర సుజాత, అడ్వకేట్ అన్నపూర్ణ, దండు నరేందర్, కోట శంకర్, పత్తి అనిల్, చెలిమెల మహేష్, దయానంద్, నర్సింగ్‌రావు, లక్ష్మీప్రియా, జయశ్రీ, మంజుల, జ్యోతి, అంజయ్య, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



వీవీ గిరినగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న బస్తీవాసులు

చిక్కడపల్లి: వీవీ గిరినగర్ బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. ఆదివారం గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో వీవీగిరినగర్ బస్తీవాసులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆమెను కలసి అందజేశారు. వీవీగిరినగర్‌లో నిర్మించిన నూతన కమ్యూనిటీహాల్ భవనంపై మరో అంతస్తు నిర్మించాలన్నారు. అందులో బస్తీలోని యువతకు ఉపయోగకరంగా ఉండేందుకు జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆమె తప్పకుండా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బస్తీలలో కమ్యూనిటీహాల్ భవనాలు నిర్మించి స్థానికుల ఉపయోగార్థం అన్నారు. బస్తీ యువకులు, అసోసియేషన్ల కోరిక మేరకు తప్పకుండా ఇక్కడ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, బస్తీ నాయకులు శ్రీనివాసకుమార్, సాయికుమార్, రాజేష్, సాయి తరుణ్, భరత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాలనీలు, బస్తీల అభివృద్ధికి కృషి చేస్తా



జైస్వాల్ గార్డెన్ రెసిడెంట్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో కాలనీలు, బస్తీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతనంగా ఎన్నికైన కమిటీని అభినందించారు. కాలనీ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే తక్షణ పరిష్కారానికి చొరవ తీసుకుంటానని అన్నారు. అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఎం.సత్యంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.స్వామిగౌడ్, చైర్మన్‌గా హెచ్‌వీ వల్లభ్, ఉపాధ్యక్షుడిగా పి.కృష్ణ, కోశాధికారిగా రాములుయాదవ్, ప్రధాన సలహాదారులుగా బి.వినోద్ కుమార్, ఎ.లక్ష్మీపతి, కేశవరావు, కె.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా ఎ.సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.ప్రవీణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా కె.శ్రీనివాస్‌గౌడ్, వీవీ రాంచందర్‌రావు, డి.చెన్నయ్యగౌడ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు.

ఆలయ కమిటీ ఎన్నిక..

అలాగే కాలనీలో ఉన్న మైసమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా చెరుకు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. ఇంద్రసేన్‌యాదవ్, చైర్మన్‌గా ఎన్.రమేష్‌గౌడ్ ఉపాధ్యక్షుడిగా కె.దిలీప్‌గౌడ్ కోశాధికారిగా పి.వెంకటేశ్‌గౌడ్, ప్రధాన సలహాదారులుగా ప్రసన్నాంజనేయులు, జి.సురేందర్, ఎ.రామగౌడ్‌లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు పీవీ నిరంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో హాస్పటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతివారం పార్కులో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని డాక్టర్ల సూచనలు సలహాలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 200ల మందికి బీపీ, షుగర్‌తో పాటు గుండె పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యక్షులు బబ్లూ, మాజీ అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్ గౌడ్, హాస్‌ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు, అంబటి శ్రీనివాస్ రెడ్డి, కల్యాణ్‌నాయక్, రమేష్‌రెడ్డి, కృష్ణ, రాజేందర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రార్థన వీరుల చర్చ్ పాస్టర్ మరిదాస్ అన్నారు. ఆదివారం రాంనగర్‌లోని ప్రార్థనవీరుల చర్చ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు, దంత, బీపీ, షుగర్, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు డాక్టర్లు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పాస్టర్ జేమ్స్, నిర్వాహకురాలు ఎఫ్రా, బెన్నీ తదితరులున్నారు.

బీసీ బిల్లు చరిత్రాత్మక నిర్ణయం

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టి విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 29 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ రెండు బిల్లులు పాస్ చేయడం చరిత్రాత్మక నిర్ణయమని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ రిజర్వేషన్లు అమలు చేయడానికి వెంటనే జీవో జారీ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ బిల్లులను కేంద్రానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. బిహార్, తమిళనాడు ప్రభుత్వాలు గతంలో అనుసరించిన విధాన ప్రక్రియను ఇక్కడ కూడా పాటించాలని సూచించారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో 26 బీసీ కుల సంఘాల నాయకులు శ్రీమణికంఠ, రాజు నేతల అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అదే విధంగా దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు చెరుకు మణికంఠ, నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, రమాదేవి, రామ్‌దేవ్, భాస్కర్, ప్రజాపతి, నరేష్‌ముదిరాజ్, స్వామిగౌడ్, రవీందర్‌యాదవ్, కుమార్‌యాదవ్, మల్లేశం, బాలయ్య, బాలస్వామి తదితరులున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



కాచిగూడ: ఉత్తరాది మఠంలో వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం లింగంపల్లిలోని ఉత్తరాది మఠం ప్రాంగణంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో కార్పొరేటర్ కన్నె ఉమారాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠం మేనేజర్ జయతీర్థచార్యులు, వాసు, కృష్ణ, బి.భీమ్‌రాజ్, ఎస్.రవి యాదవ్, సంతోష్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 30వేల రూపాయల పెన్షన్, 250గజాల స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అంతేకాకుండా 100 ఎకరాలలో అమరవీరుల పేరుమీద స్మారక భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డుతో పాటు ఉచిత ఆరోగ్య బీమా, ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బత్తుల సోమన్న, కంచర్ల రాజేంద్రప్రసాద్, పెద్ది యాదగిరి, ఆనంద్, గౌరవ సలహాదారులు రంగారెడ్డి, మోహన్‌బైరాగి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారుల జేఏసీ సదస్సులో అభివాదం చేస్తున్న సుల్తాన్ యాదగిరి తదితరులు

ట్యాంక్‌బండ్‌పై పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కాచిగూడ: ట్యాంక్‌బండ్‌పై మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా అందరికీ ఒకే విద్యను అందించాలన్నారు. విద్యా హక్కు చట్టం అమలు చేయాలని ఆయన ఒక ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు 42 శాతంకు పెంచుతూ అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. బీసీ బిల్లుకు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్‌లో చేర్పించే విధంగా అఖిల పక్ష పార్టీలను సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాష్‌గౌడ్‌కు రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు.

భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవాలకు 'పల్లకీ' బహూకరణ

ముషీరాబాద్: బాకారంలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవాల ఊరేగింపునకు ఉపయోగించే 'పల్లకీ'ముషీరాబాద్‌కు చెందిన స్వామివారి భక్తుడు సతీష్ ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకి సేవలను ఆయన కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డికి అందజేశారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో స్వామివారి పల్లకీకి వేదపండితులు మధుసుదనాచారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. స్వామివారిని అలంకరించి పిల్లకీలో పురవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.ఉర్మిల, భక్తులు గోక నవీన్, ముదిగొండ మురళీ, రామానందరెడ్డి, సురేష్‌కుమార్, జ్ఞానేశ్వర్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి

వచనాన్ని పద్యంలోకి మార్చడం కష్టం

తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ కార్యదర్శి డా. ఏనుగు నరసింహారెడ్డి

చిక్కడపల్లి: ప్రపంచంలో ఏదైనా నశించిపోతుందేమో కానీ పుస్తకం మాత్రం ఎల్లకాలం నిలిచిపోతుందని ప్రముఖ కవి తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలోని కళాసంగీత నాట్య వేదిక త్యాగరాయ గానసభలో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరై కీర్తి శేషులు గుండవరం చంద్రశేఖరరావు రచించిన 'మిత్రలాభం పద్య కావ్యం'ఆయన కుమారుడు గుండవరం ప్రభాకర్‌రావు రచించిన ప్రభాత కిరణాలు పుస్తకాలను ఆవిష్కరించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పద్యాన్ని వచనంలోకి మార్చడం సులభమేమో కానీ వచనాన్ని పద్యంలోకి మార్చడం అంత సులువు కాదన్నారు. అలాంటి గొప్ప పనిని కీర్తి శేషులు చంద్రశేఖర్‌రావు చేశారని కొనియాడారు. ప్రబోధ నిర్వచనం, నీతి చంద్రిక, మిత్రలాభం విశిష్ట కావ్యలని పేర్కొన్నారు. ఆ కాలంలో ఆయనకు గుర్తింపు లభించి ఉంటే మరికొన్ని ఉత్తమ కావ్యాలు వెలువడేవని అన్నారు.

◆ విశిష్ట అతిథిగా విచ్చేసిన రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుండవరం దేవి ప్రసాదరావు మాట్లాడుతూ.. ఉత్తమ ఉపాధ్యాయులుగా పేరొందిన చంద్రశేఖరరావు రచించిన మిత్రలాభం ఉత్కృష్ట గ్రంథంగా నిలుస్తుందన్నారు. మరొక విశిష్ట అతిథి టీవీ సినీ గేయా రచయిత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ.. బాల గేయాలు రచించడం రచయితకి ఒక విషమ పరీక్ష అని అన్నారు. బాలల మనస్తత్వాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకున్న వారికే అది సాధ్యమని అందులో ప్రభాకర్‌రావు ఒక అడుగు ముందుకు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ రాధా కుసుమ, గుండవరం చంద్రశేఖర్‌రావు ప్రియశిష్యుడు బొడ్డు హరికిషన్, దర్పణం సాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావులు, విశ్రాంత ప్రధానాచార్యులు డి.సి.నరసంహులతో పాటు 50 మందికిపైగా కవులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఏనుగు నరసింహారెడ్డి, దేవి ప్రసాదరావు, వైర్యాగం ప్రభాకర్



ఎస్వీకేంద్రంలో జరిగిన యువజనోత్సవంలో మాట్లాడుతున్న అజయ్ ఘోష్

పుస్తకాలను చదివి చరిత్రను తెలుసుకోవాలి: నటుడు అజయ్ ఘోష్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ జాతీయ నాయకుల చరిత్ర పుస్తకాలను చదివి చరిత్ర తెలుసుకోవాలని సినీ నటులు అజయ్ ఘోష్ అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని యువజనోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అజయ్ ఘోష్ మాట్లాడుతూ... డ్రగ్స్, మద్యం, మత్తు అత్యంత ప్రమాదకరమని అన్నారు. దానికి విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా ఫోన్‌లకు బానిసలు కాకుండా మంచి పుస్తకాలను చదవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు బాబ్జీ, వాలీబాల్ జాతీయ మాజీ క్రీడాకారుడు కిరణ్‌రెడ్డి, జేకే శ్రీనివాస్, మహేందర్, హాస్మీ, జావేద్, లెనిన్, అశోక్‌రెడ్డి, పవన్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.